ప్రధాని తెలంగాణ పర్యటన ఖరారు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 25న మహేశ్వరం, కామారెడ్డి సభల్లో పాల్గొననున్నారు. 26న తూప్రాన్, నిర్మల్, 27న మహబూబాబాద్, కరీంనగర్ ప్రచార సభల్లో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం హైదరాబాద్‌లో జరిగే రోడ్‌షోకు హాజరవుతారు. ప్రధాని మోడీతో ప్రచార సభల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా పాల్గొంటారని బిజెపి వర్గాలు తెలిపాయి.

బర్రెలక్క తమ్మునిపై దాడి

- పోలీసు రక్షణ కల్పించాలని శిరీష డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క (శిరీష) తమ్మునిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని వెన్నచర్ల గ్రామంలో మంగళవారం జరిగింది. వెన్నచర్ల గ్రామంలో బర్రెలక్క (శిరీష) తన ప్రచారాన్ని ముగించుకొని వెళ్తుండగా ఆమె తమ్ముడు చింటూ అలియాస్ భరత్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. దాంతో శిరీష పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజు తెలిపారు. అనంతరం ఆమె తన మద్దతుదారులతో కలిసి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. దళిత బిడ్డను.. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడం వల్లే బెదిరింపు కాల్స్, దాడులు చేసి తన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. తనకు ప్రాణభయం ఉందన్నారు. పోలీస్ ప్రొటక్షన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు జరగనందున ఎన్నికల బరిలో నిలిచానని, అది జీర్ణించుకోని వారు తమపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ వచ్చేది లేదు.. చచ్చేది లేదు

- బిజెపికి ఓటేస్తే డ్రయినేజీలో వేసినట్టే
- ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్

ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడుతున్న కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ వచ్చేది లేదు.. చచ్చేది లేదని బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీలో డజన్ మంది ముఖ్యమంత్రి అభ్యర్థులున్నారని, భట్టి ముఖ్యమంత్రి అయితడా అని ప్రశ్నించారు. ఆ పార్టీకి మళ్లీ 20 సీట్లలోపే వస్తాయన్నారు. రాయేదో.. రత్నమేదో తెలుసుకొని ఓటేయాలని కోరారు. బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే దళితబంధైనా.. రైతుబంధైనా.. అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో పడవేస్తామని, దానికి బదులు తెచ్చేది 'భూమాత'నా.. భూమేతనా? అని ఎద్దేవా చేశారు. మంగళవారం మధిర, వైరా, సూర్యాపేట, డోర్నకల్ నియోజకవర్గాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సిఎం కెసిఆర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ చరిత్ర అంతా మోసాలే..

ఖమ్మం జిల్లా మధిర, వైరా నియోజకవర్గాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు లింగాల కమల్‌రాజ్, బాణోత్ మదన్‌లాల్ విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటుచేసిన సభలో సిఎం మాట్లాడారు. ఎన్నికల పర్యటనలో భాగంగా మధిరకు 70వ మీటింగ్‌కు వచ్చానని, వెళ్లాల్సినవి ఇంకా 30 ఉన్నాయని తెలిపారు. తాను ఎట్టెట్ట పోతనో అట్టట్ట కాంగ్రెస్ ఊడ్చుకుపోతుందన్నారు. పాత మెజార్టీ కన్నా ఇంకా రెండు సీట్లు పెంచుకుని బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందనడంలో ఎలాంటి అనుమానం లేదని తెలిపారు. కాంగ్రెస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి భట్టి విక్రమార్కతో వచ్చేదేంది.. పోయేదేందని ప్రశ్నించారు. భట్టి గెలుస్తేగా ముఖ్యమంత్ర య్యేదన్నారు. 50 ఏండ్ల కాంగ్రెస్‌లో దళితులను ఓటు బ్యాంకుగా వాడుకున్నదే తప్ప దళితబంధులాంటి ఒక్క ఆలోచన కూడా చేయలేదన్నారు. తాము అధికారంలోకి రాగానే మధిర నియోజకవర్గం మొత్తం ఒక్కటేసారి దళితబంధు పెడతామని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మధిర ఎమ్మెల్యేగా ఉన్న బోడేపూడి వెంకటేశ్వరరావు.. ఎన్ఎస్‌పి నీరు అందడం లేదని, ఆయకట్టు ఎండిపోతుందని వరి కంకులు తెచ్చి శాసనసభ లో చూపించేవారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ వస్తలేదని అసెంబ్లీకి కంకులు, కిరోసిన్ బుడ్లు పట్టుకు వచ్చే దుస్థితి ఉండేదని, కానీ ఈ పదేండ్లలో ఎక్కడా ఒక ఎకరం పొలం ఎండలేదని చెప్పారు. అసెంబ్లీ గేట్లు తాకనీయపోవడానికి ఆయనెవరని ప్రశ్నించారు. అందుకే నోట్ల కట్టల ఆసాములకు ఓట్లతో గుద్ది గుద్ది బుద్ధి చెప్పాలని కోరారు.

ధరణి తీసేస్తే.. మళ్లీ దళారుల రాజ్యమే..

ధరణి తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యం రావడం ఖాయమని సూర్యాపేటలో జరిగిన సభలో సిఎం కెసిఆర్ తెలిపారు. అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో గంగలో కలపాలని కోరారు. ధరణిని తీసివేస్తే రైతుబంధు.. రైతు బీమా.. ఎలా వస్తయని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మునుగోడు, దేవరకొండలో ఫ్లోరోసిస్‌తో 1,50,000 మంది ప్రజల ఉసురు పోసుకుంది కాంగ్రెస్ కాదా అన్నారు. నా కంటే దొడ్డుగా, ఎత్తుగా ఉన్నోళ్లు చాలా మంది ఉన్నారని, వారు కనీసం ఆలోచించి.. మంచినీళ్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇవాళ బ్రహ్మాండంగా పాలేరు నుంచి పాల లాంటి నీళ్లువస్తున్నాయన్నారు. నాగార్జునసాగర్ టేయిల్ పాండ్ నుంచి మంచినీళ్లు వస్తున్నాయని చెప్పారు. ఇది ఎర్రజెండాలు ఎగిరిన గడ్డ అని, కమ్యూనిస్టు ఉద్యమాలు నడిపిన గడ్డ అని, భీంరెడ్డి నర్సింహారెడ్డి లాంటి మహానీయులు పని చేసిన గడ్డ మీద దుర్మార్గుల ఆగడాలు ఏంద న్నారు. బిజెపికి ఓటేస్తే మోరిలో వేసినట్లేనని తెలిపారు. రూ.30 వేల కోట్లతో యాదాద్రి పవర్‌ప్లాంట్ నల్లగొండలో నిర్మాణం కావడం జగదీశ్‌రెడ్డి కృషి ఫలితమే న్నారు. కాళేశ్వరం జలాలతో సూర్యాపేటను కోన సీమ లాగా మార్చిన ఘనత సిఎం కెసిఆర్‌దేనని మంత్రి, సూర్యాపేట అభ్యర్థి జగదీశ్‌రెడ్డి అన్నారు.

రాహుల్‌కు వ్యవసాయం ఏం తెలుసు..?

కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్ గాంధీ ధరణి వద్దని, దాన్ని బంగాళాఖాతంలో వేయాలని అంటున్నారని, ఎద్దు, పొలం లేని వారికి వ్యవసాయం గురించి ఏం తెలుసని సిఎం కెసిఆర్ ఎద్దేవా చేశారు. డోర్నకల్ నియోజకవర్గ సభలో సిఎం మాట్లాడుతూ.. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో సాధించిన అభివృద్ధి ఫలాలు కావాలో.. కాంగ్రెస్ రాజ్యంలో అవినీతి కావాలో..ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రభుత్వం మూడోసారి రాగానే మంత్రి పదవి ఇస్తామని రెడ్యాకు సిఎం కెసిఆర్ హామీ ఇచ్చారు.

తొమ్మిదిన్నరేళ్లలో 1.60 లక్షల కొలువులు

- ఉద్యోగాల భర్తీలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానం
- యువతను తప్పుదోవ పట్టిస్తున్న ప్రతిపక్షాలు
- వెబ్‌సైట్‌ను ప్రారంభించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తొమ్మిదిన్నరేండ్లలో 2,32,308 ప్రభుత్వ ఉద్యోగాలను గుర్తించి 1.60 లక్షల కొలువులు ఇచ్చామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి అధికారిక వివరాలతో కూడిన వెబ్‌సైట్‌ను ఆయన మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర యువతను తప్పుదోవ పట్టిస్తున్న నేపథ్యంలో గత పదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని వివరించారు. తాము ఇచ్చిన లక్ష ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కన్నా రెట్టింపుకుపైగా ఉద్యోగాలను కల్పించామని చెప్పారు. జనాభాతో పోల్చి చూసినప్పుడు దేశంలోనే అత్యధిక ఉద్యోగాలను భర్తీ చేసిన రాష్ట్రంగా తెలంగాణ ప్రభుత్వం అగ్రస్థానంలో నిలుస్తుందన్నారు. సోమవారం ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంసిద్ధం అవుతున్న యువకులతో సుదీర్ఘంగా కెటిఆర్ చర్చించిన విషయం తెలిసిందే. వారి విజ్ఞప్తి మేరకు ప్రజలకు ముఖ్యంగా యువకులకు అందుబాటులో ఉండేలా ఈ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇన్ని ఉద్యోగాలు ఇచ్చిన తర్వాత కూడా పలు రాజకీయ పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారం వల్ల యువతలో పలు అపోహలు నెలకొన్నాయని కెటిఆర్ దృష్టికి యువకులు తీసుకొచ్చారు. ఆ చర్చ సందర్భంగా వారికి ప్రభుత్వ అధికారిక లెక్కలతో కూడిన వివరాలను కెటిఆర్ వివరించారు. ఆ సమాచారం పట్ల యువకులు సంతృప్తి, ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వాటన్నింటినీ రాష్ట్ర యువతకు అందుబాటులో ఉంచాలని కేటీఆర్‌ను కోరారు. అందుకే వెబ్‌సైట్‌లో ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలతోపాటు, అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయడం, విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల శిక్షణ కోసం మరిన్ని స్టడీ సర్కిళ్ల ఏర్పాటు వంటి అంశాలపైన వివరాలు అందుబాటులో ఉంచారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క విద్యార్థి, యువతీ యువకులు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి నిజాలు తెలుసుకోవాలని కెటిఆర్ కోరారు. www.telanganajobstats.in వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు ఉంచినట్లు ఆయన తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజ్‌పై హైకోర్టుకు వెళ్లండి

- పిటిషనర్ జి. నిరంజన్‌కు ఢిల్లీ హైకోర్టు సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టులో అతి ముఖ్యమైన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడంపై సిబిఐతో విచారణ జరిపించాలంటూ దాఖలైన పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టుకే వెళ్లాలని ఢిల్లీ హైకోర్టు సూచించింది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై ఇటీవల నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) పర్యటించి, భద్రతా లోపాలను గుర్తించినా కేంద్రం చర్యలు తీసుకోలేదని పిసిసి ఉపాధ్యక్షుడు జి. నిరంజన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అలాగే బ్యారేజ్ నిర్మాణంలో అవినీతిపై సిబిఐ విచారణ జరిపించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎన్‌డిఎస్‌ఏ సూచించినట్టు డ్యాం సేఫ్టీపై చర్యలు తీసుకునేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని అందులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సుబ్రమణియం ధర్మాసనం మంగళవారం విచారించింది. హైదరాబాద్‌కు సంబంధించిన అంశం ఇక్కడికి తీసుకురావాల్సిన పరిస్థితి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. దీనికి బదులిస్తూ... ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికల నేపథ్యంలో ఇక్కడికి వచ్చామని, అలాగే పిటిషన్ ప్రతివాదిగా పేర్కొన్న నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఢిల్లీలోనే ఉందని నిరంజన్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా జస్టిస్ సుబ్రమణియం కీలక వ్యాఖ్యలు చేశారు. 'స్థానిక పరిస్థితులు అంశాలు పరిశీలించి స్థానిక హైకోర్టు న్యాయమూర్తులే ఉత్తమంగా విచారించగలరు. డ్యామ్ ఎక్కడ ఉందో అక్కడి హైకోర్టును (తెలంగాణ)ను ఆశ్రయించడం మంచిది' అని పిటిషనర్ తరపు న్యాయవాదికి సూచించారు. అలాగే పిటిషన్ ఉపసంహరించుకొని తెలంగాణ హైకోర్టుకు వెళ్లాలని సూచిస్తూ పిటిషన్‌పై విచారణ ముగించారు.

ఆ 14 మంది ఉద్యోగుల్ని వెనక్కి తీసుకోవాలి
జనవరి 16 వరకు ఎపి ట్రాన్స్‌కోకు సుప్రీంకోర్టు గడువు

న్యూఢిల్లీ : జస్టిస్ ధర్మాధికారి సిఫారసులకు వ్యతిరేకంగా తెలంగాణకు పంపిన 14 మంది ఎపి ఉద్యోగులను వెనక్కి తీసుకోవాలని ఎపి ట్రాన్స్‌కోను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇందుకోసం జనవరి 16 వరకు సమయమిచ్చింది. జస్టిస్ ధర్మాధికారి సిఫార్సులకు భిన్నంగా తమను తెలంగాణకు పంపారంటూ ఉద్యోగులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం... ఉద్యోగుల్ని వెనక్కి తీసుకోవడానికి జనవరి 16 వరకు గడువు ఇస్తున్నట్టు వెల్లడించింది. తదుపరి తదుపరి విచారణ అదే రోజు చేపడతామని స్పష్టం చేసింది.

నిరుద్యోగులపై కెటిఆర్ వ్యాఖ్యలు గర్హనీయం

- మోసం చేసినందుకు యువతకు క్షమాపణ చెప్పాలి : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ప్రచార సభల్లో యువత, నిరుద్యోగులపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ వ్యాఖ్యలు గర్హనీయమని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కె ధర్మేంద్ర విమర్శించారు. నిరుద్యోగులను మోసం చేసినందుకు కెటిఆర్ ముక్కు నేలకు రాసి, క్షమాపణ చెప్పాలని మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తొమ్మిదేండ్ల కాలంలో యువతను, నిరుద్యోగులను బిఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందనీ, వారి జీవితాలతో ఆటలాడిందని తెలిపారు. వందలాది మంది నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే టీఎస్‌పిఎస్‌సి బోర్డును ప్రక్షాళన చేస్తామనీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామనీ, ఉద్యోగాల భర్తీని వేగవంతం చేస్తామనీ, గ్రూప్-2 పోస్టుల సంఖ్యను పెంచుతామనీ, కేసులను ఎత్తేస్తామంటూ ప్రగల్భాలు పలికారని తెలిపారు. ఈ బోగస్ మాటలను నమ్మొద్దనీ, ఇన్నేండ్లలో ఎందుకు ఈ అంశాల పట్ల సానుకూల వైఖరి కనబర్చలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగులు ఆత్మహత్యలకు తాను నైతిక బాధ్యత వహిస్తానంటూ కెటిఆర్ ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. మాటల గారడీతో యువతను మభ్య పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు.

మార్పు రావాలంటే.. కాంగ్రెస్ గెలవాలి

బహిరంగ సభలో మాట్లాడుతున్న రేవంత్

- తెలంగాణ తెచ్చినా.. వలసలు మారలే
- పదేండ్ల నియంతల పాలనకు చరమగీతం పాడండి
- టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన బిఆర్ఎస్ ఆగడాలకు అంతులేకుండా పోయిందని, ఇప్పటికైనా ప్రత్యేక రాష్ట్రంలో సాహసోపేత కార్యక్రమాలు చేపట్టి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురావాలటే కాంగ్రెస్‌ను గెలిపించాలని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి కోరారు. మంగళవారం వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రాల్లో జరిగిన కాంగ్రెస్ విజయభేరీ యాత్ర బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలన అంతం తర్వాత మహబూబ్‌నగర్ నుంచి బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని గుర్తు చేశారు. మీ బిడ్డగా పిసిసి అధ్యక్షుల హోదాలో ఇక్కడికి వచ్చానని, ఈ ప్రాంతంలో నిలబడిన కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఎవరు గెలిచినా ఈ ప్రాంతం నుంచి వలసలు పోలేదని, రైతుల ఆత్మహత్యలు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మన ప్రాంతాన్ని మనమే అభివృద్ధి చేసుకునే అవకాశం తల్లి సోనియమ్మ ఇచ్చిందని, దాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు ఉపయో గించుకోవాలని కోరారు. కెసిఆర్‌ను సొంత నియోజకవర్గంలో తిరస్కరిస్తే పాలమూరులో ఆతిథ్యమిచ్చి ఢిల్లీకి పంపించామని, కానీ ఈ ప్రాంతానికి ఆయన ఒరగబెట్టింది ఏమీ లేదని తెలిపారు. పాలమూరు ప్రజలు ఇచ్చిన రాజకీయ భిక్షతో అధికారంలోకి వచ్చిన కెసిఆర్.. ఈ ప్రాంత ప్రాజెక్టులపై వివక్ష కనబరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగానే రైతుల మీద ప్రేమ ఉంటే రాష్ట్రంలో రైతుల మరణాలను ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే ఏమొస్తదని ప్రశ్నించిన కెసిఆర్‌కు మనం సమాధానం చెప్పాల్సిన అవసరముందన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రాజెక్టులు, బ్యాంకుల జాతీయాకరణ, భూ పంపిణీ, భారీ ప్రాజెక్టుల నిర్మాణం వంటి పథకాలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని తెలిపారు. కెసిఆర్‌కు సింగిల్ విండో డైరెక్టర్ మొదలుకొని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించి రాజకీయంగా ఎదగడానికి కారణమైనది కాంగ్రెస్సేనని గుర్తుంచు కోవాలన్నారు. వైఎస్ఆర్ కాలంలో తన్నీరు హరీశ్ రావు మంత్రిగా పనిచేసిన విషయం తెలియదా? అని ప్రశ్నించారు. అందుకే విశ్వాసఘా తకమైన కెసిఆర్ కుటుంబాన్ని పారదోలి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లు రవి, మంద జగన్నాథం, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూల్ అభ్యర్థి కూచుకుల్ల రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు కాలేదనడానికి మీరేమైనా లబ్ధిదారులా?

- బిఆర్ఎస్ సర్కారుపై కర్ణాటక మంత్రి ప్రియాంక్‌ఖర్గే ఆరోపణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ ప్రభుత్వ పదేండ్ల పాలనలో పది పథకాలు ప్రవేశ పెట్టి రూ. పదివేల కోట్లు దోచుకుందని కర్ణాటక ఐటీ మంత్రి ప్రియాంక్‌ఖర్గే ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వాన్ని బదనాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు అమలు కాలేదనడానికి బిఆర్ఎస్ నేతలేమైనా లబ్ధిదారులా? అని ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే శరత్, జాతీయఅధికార ప్రతినిధి షామా, సీనియర్ నేత వీ. హనుమంతరావులతో ప్రియాంక్‌ఖర్గే విలేకర్లతో మాట్లాడారు. నాలుగు ఐదు రోజుల నుంచి హైదరాబాదులో తిరుగుతున్నామన్నారు. పదేండ్ల బిఆర్ఎస్ పరిపాలనలో అనేక సమస్యలున్నాయన్నారు. బిఆర్ఎస్ నేతలు కర్ణాటక ప్రభుత్వాన్ని, కాంగ్రెస్‌ను బదనాం చేస్తున్నారని విమర్శించారు. సొంత రాష్ట్రంలో చేయలేక కర్ణాటకపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పేదలకు కర్ణాటకలో హామీలు అమలు అవుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోను చూసి బిఆర్ఎస్ భయపడుతున్నదని చెప్పారు. 2013లో మ్యానిఫెస్టోలో 165 అంశాలుంటే, 158 హామీలను అమలు పరిచినట్టు తెలిపారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలను ఆరు నెలల్లోనే అమలు చేశామన్నారు. ఆ విషయం బిఆర్ఎస్ నేతలకు ఏం తెలుసన్నారు. వాళు లబ్ధిదారులు కాదు కదా? అని ప్రశ్నించారు. ఐదు గ్యారంటీల కోసం ఎన్‌రోల్ చేసుకుంటే అర్హత బట్టి అందిస్తామన్నారు. గృహలక్ష్మి పథకాన్ని 1.60 కోట్ల మంది అందించామన్నారు. అన్నభాగ్య పథకాన్ని 3.92 కోట్ల మందికి ఇవ్వడం జరిగిందన్నారు. మోడీ, కెసిఆర్ ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీలా మెలుగుతున్నారని విమర్శించారు. కర్ణాటకలో ప్రతిరోజు 60 లక్షల మంది మహిళలు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్నారని చెప్పారు. వాళ్లంతా ప్రభుత్వం బాగుండాలని దేవాలయాల్లో పూజలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణలో 3600 మంది యువత ఆత్మహత్యలు చేసుకున్నారనీ, ఇక్కడ ఉద్యోగాలు లేక బెంగళూరుకు వచ్చి ఉద్యోగాలు చేస్తున్నారని మంత్రి కెటిఆర్‌కు గుర్తు చేశారు. కర్ణాటక ప్రజలు స్కీములతో రూ. 80 వేల నుంచి లక్ష వరకు సేవింగ్స్ చేసుకుంటున్నారని చెప్పారు. కానీ బిఆర్ఎస్ ప్రజాధనం ఫామ్‌హౌస్‌లో నింపుతున్నదన్నారు. కర్ణాటకలో అన్ని స్కీమ్‌లు అద్భుతంగా అమలు అవుతున్నాయని చెప్పారు. పథకాలు అమలు కావడం లేదనే అనుమానం బిఆర్ఎస్ నాయకులకు ఉంటే గాంధీభవన్ నుంచి బస్సు పెడతాను తిరిగి పరిశీలించవచ్చునన్నారు.

డిజిటల్ గవర్నెన్స్‌పై అవగాహన పెరగాలి

- ఆడిట్ వీక్ వారోత్సవాల్లో వక్తలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డిజిటల్ గవర్నెన్స్‌పై మరింత అవగాహన పెరగాల్సిన అవసరముందని పలువురు అభిప్రాయపడ్డారు. ఆడిట్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం డిజిటల్ గవర్నెన్స్ అండ్ సిటీజన్ సెంట్రిసిటీ అనే అంశంపై నిర్వహించిన చర్చావేదికలో సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర నిమ్జే, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అడిగిన ప్రశ్నలకు వారు సమాధానాలిచ్చారు. అనంతరం హైదరాబాద్ కమర్షియల్ ఆడిట్ డీజీ ఎం.ఎస్.సుబ్రమణ్యన్ వారికి మెమెంటోలను అందజేశారు. అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ , ఎంఎన్ జే క్యాన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ను నిర్వహించారు. అనంతరం పలువురు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి..

- ఆగం కావొద్దు - అబద్ధాలు నమ్మొద్దు
- ముస్తాబాద్ రోడ్ షోలో మంత్రి కెటిఆర్



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

"కాంగ్రెస్, బిజెపి ప్రచారంలో ఆగమాగం చేస్తున్నాయి. ఓటర్లూ.. ఆగం కాకండి. కాంగ్రెస్ 50 సంవత్సరాల పరిపాలనలో అభివృద్ధి ఎక్కడ జరిగింది? రాష్ట్రంలో 11 సార్లు గెలిపించింది చాలదన్నట్టు మళ్లీ ఒకసారి గెలిపించండని కోరుతున్నారు.. జాగ్రత్త" అంటూ సిరిసిల్ల బిఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కెటిఆర్ అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని ముస్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు, 24 గంటల కరెంటు, ధరణి వంటివి ప్రశ్నార్థకం అవుతాయన్నారు. తమ హయాంలో కడుపునిండా సంక్షేమ పథకాలు ఇవ్వనోళ్లు ఇప్పుడు ఎలా ఇస్తారో ఆలోచించాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ హయాంలో ఎట్లుండె, ఇప్పుడు ఎట్లయింది అన్నది మీ కండ్ల ముందే ఉన్నదని చెప్పారు. కాంగ్రెస్ చెప్పే కల్లబొల్లి కబుర్లు, మాయమాటలు నమ్మొద్దని సూచించారు. గ్యాస్ సిలిండరుపై మోడీ మోపిన రూ.800 భారాన్ని కెసిఆర్ సర్కారు భరించి రూ.400కే ఇస్తాదని భరోసా ఇచ్చారు. కులం, మతం పేరిట రెచ్చగొట్టే పార్టీలను నమ్మొద్దని చెప్పారు. సిరిసిల్ల ప్రాంతంలో ముఖ్యమైన నర్మాల ప్రాజెక్టును గోదావరి జలాలతో నింపి ఈ ప్రాంతమంతా సస్యశ్యామలం చేసిన ఘనత కెసిఆర్‌దేనని గుర్తు చేశారు. ముస్తాబాద్ పెద్ద చెరువుకు జీవకళ తెచ్చామని చెప్పారు. ముస్తాబాద్‌కు డిగ్రీ కళాశాల వచ్చే జనవరికల్లా మంజూరు చేస్తామని ప్రకటించారు. 30 పడకల ఆస్పత్రి ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. డిసెంబర్ తర్వాత 18ఏండ్లు దాటిన మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం, ఆసరా పింఛన్ల పెంపు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రాహుల్ గాంధీకి, బీజేపీకి ఓటు వేస్తే మోడీకి పోతుందంటూ, ఈ నెల 30న కారు గుర్తుకు ఓటు వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కత్తిపోటుకు.. ఓటుతో సమాధానం

కత్తిపోట్ల రాజకీయాలకు ఓటు పోటుతో సమాధానం చెబుతామని మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారం మంత్రి కెటిఆర్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. లుచ్చామాటలతో దుబ్బాక బిజెపి ఎమ్మెల్యేగా గెలిచిన రఘునందన్‌రావుకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పి ఇంటికి పంపాలన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని, మరోసారి నమ్మితే రాష్ట్రం 50 సంవత్సరాలు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. ఎంపీ ప్రభాకర్‌రెడ్డి కత్తిపోటుకు గురై పెద్ద ప్రమాదం నుంచి బయట పడ్డారని, ప్రజలు ఓట్ల పోటుతో ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడంతోపాటు దుబ్బాకను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే దమ్ము కమ్యూనిస్టులదే

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి
- పలు గ్రామాల్లో సిపిఎం అభ్యర్థి మల్లు లక్ష్మి ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలపై పోరాడే దమ్ము కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి జ్యోతి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసాపురం, లింగగిరి, గోపాలపురం, బూరుగడ్డ, కరక్కాయలగూడెం, మర్రిగూడెం గ్రామాల్లో అభ్యర్థి మల్లులక్ష్మితో కలిసి ప్రచార యాత్రలో మాట్లాడారు. సాయుధ తెలంగాణ పోరాట యోధులు మల్లు స్వరాజ్యం కోడలైన మల్లు లక్ష్మి అనేక మహిళా సమస్యలపై పోరాటాలు చేసిన అనుభవం ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికల్లో ప్రశ్నించే తత్వం, పోరాడే శక్తి ఉన్న ఆమెకు ఓటు వేసి అసెంబ్లీకి పంపాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ చిచ్చుపెట్టాలని చూస్తోందన్నారు.

వామపక్షాల పోరాట ఫలితంగా తెచ్చుకున్న గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని ప్రస్తుత బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. చౌక ధరల దుకాణాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక బియ్యం కోసమే పరిమితం చేశాయని తెలిపారు. ఓట్ల కోసమే మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఆమోదం చేశారని, అమలు మాత్రం చేయడం లేదన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను గాలికి వదిలి తమ ఆస్తులను ఎలా పెంచుకోవాలో, ఎలా రక్షించుకోవాలని మాత్రమే ఆలోచన చేస్తున్నారన్నారు.

ప్రచారంలో మాట్లాడుతున్న టి జ్యోతి

సిపిఎం అభ్యర్థి మల్లు లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఆసరా పెన్షన్లు, సమభావన సంఘాల లోన్లు వంటి సమస్యలపై తాను ప్రత్యక్ష పోరాటం చేశానని గుర్తుచేశారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉండి, వాటిపై పోరాడే తనను అసెంబ్లీకి పంపిస్తే అసెంబ్లీ బయటా, లోపలా బడుగు, బలహీనవర్గాల గొంతుక అవుతానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, డివైఎఫ్‌వై రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎంకు అపూర్వ స్పందన

- తమ్మినేనికి పెరుగుతున్న ఆదరణ
- డబ్బు రాజకీయాలకు దీటుగా ఎర్రజెండా ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలేరులో తమ్మినేని గెలుపుతో నియోజకవర్గంలో కమ్యూనిస్టులకు పూర్వవైభవం సంతరించుకుంటుందన్న ప్రచారం జోరుగా నడుస్తోంది. పాలేరు నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రంకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని, నియోజకవర్గంలో ఎర్రజెండా ఎగరటం ఖాయమని కమ్యూనిస్టు కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆ పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, మహిళలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటి ప్రచారంలో సిపిఎంకు అపూర్వ స్పందన లభిస్తోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజలు తిరస్కరించే విధంగా ఇంటింటి ప్రచారంలో ఎర్రజెండా గొప్పతనాన్ని, సిపిఎం అభ్యర్థి తమ్మినేని పోరాట చరిత్రను ప్రజలకు వివరిస్తూ వస్తున్నారు.

డబ్బు రాజకీయాలకు దీటుగా ప్రచారం

కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా నియోజకవర్గంలో కార్మికులు సొంతంగా వెళ్లి తమ్మినేనికి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు. రాజకీయాల్లో డబ్బు కీలకం కావడంతో దాని వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. రోజుకో పార్టీ మారుతున్న అభ్యర్థుల చరిత్రను ప్రజలకు వివరిస్తున్నారు. చర్చకు లేవనెత్తుతున్నారు.

అభ్యర్థుల చరిత్రను వివరిస్తూ..

సిపిఎం పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం.. విద్యార్థి దశ నుంచి నేటి వరకు ఎర్రజెండాను విడువకుండా, నీతివంతమైన రాజకీయాలు చేస్తూ, పార్లమెంటు సభ్యుడిగా, అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రజా సమస్యల కోసం తన ప్రజా వాణిని వినిపించారు. ఖమ్మం జిల్లాలో ఎన్నో ఉద్యమాలకు ఊపిరి పోసి, ఎందరో కమ్యూనిస్టు కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి తలాపునే ఉన్నా జిల్లాకు నీటి కష్టాలు తప్పలేదు. వృథాగా పోతున్న గోదావరి జలాలను లిఫ్ట్ చేస్తూ పాలేరు జలాశయంలో కలిపితే పాలేరు నియోజకవర్గంతో పాటు, ఖమ్మం జిల్లా మొత్తం సస్యశ్యామలం అవుతుందని గుర్తించిన ఆయన దుమ్ముగూడెం నిర్మాణం కోసం 2600 కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. ఇప్పుడు ఆ అంశమూ ఎన్నికల్లో చర్చనీయాంశం అవుతోంది. దేవాదుల, సీతారామ ప్రాజెక్టు గురించి చర్చలు నడుస్తున్నప్పుడు ఎవరి వల్ల ఆ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందనేది జనం చర్చించుకుంటున్నారు.

తమ్మినేని చేసిన పోరాటంలో మచ్చుకు కొన్ని ఫలితాలు..

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా పాలేరును సస్యశ్యామలం చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం చెప్పుకుంటోంది. కానీ ఆనాడే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా దుమ్ముగూడెం ప్రాజెక్టు నిర్మాణం చేయాలని, గోదావరి జలాలు గోదారి జలాలను తీసుకొచ్చి పాలేరులో కలిపితే సస్యశ్యామలవుతుందని గుర్తించి పాదయాత్ర నిర్వహించారు తమ్మినేని. ఆ పోరాట ఫలితంగానే ఆనాటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ సమయంలో రాజీవ్‌సాగర్, ఇందిరా సాగర్ అనే పేర్లతో ఆ ప్రాజెక్టుకి శంకుస్థాపన చేశారు. నేడు బిఆర్ఎస్ ప్రభుత్వం దుమ్ముగూడెం ప్రాజెక్టుకు సీతారామ సాగర్ అనే నామకరణ చేసింది. ఏ ప్రభుత్వమైనా ప్రజల మీద ఉన్న ప్రేమతో శంకుస్థాపనలు చేయలేదు. తమ్మినేని పాదయాత్ర ఫలితంగానే ఈ ప్రాజెక్టు మంజూరైందని పాలేరు ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

ఎస్సి సబ్‌ప్లాన్ అమలు

ఆనాడు రాష్ట్రంలో దళితవాడలను పట్టించుకునే పాలకులే లేరు. దళిత వాడల అభివృద్ధికై తమ్మినేని రాష్ట్రవ్యాప్తంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేసి దళితవాడలు తిరుగుతూ వారి స్థితిగతులపై అధ్యయనం చేశారు. దళితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాల మెడలు వంచి ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ చట్టం రూపుదాల్చడంలో సైకిల్ యాత్ర ప్రభావం పడింది. ఈ రోజు ప్రతి గ్రామంలో ఎస్సి, ఎస్టి వార్డులలో అభివృద్ధి సిసి రోడ్లు, వీధిలైట్లు, డ్రయినేజీలు ఇలాంటి కనీస మౌలిక సదుపాయాలు అమలులోకి వచ్చాయంటే అది కెవిపిఎస్, తమ్మినేని నాయకత్వాన నిర్వహించిన సైకిల్ యాత్ర ఫలితమేనని దళిత వాడల్లో చర్చ నడుస్తోంది. తెలంగాణలో సామాజిక న్యాయం, రాష్ట్ర సమగ్రాభివృద్ధి నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు నెలలపాటు 4,200 కిలోమీటర్లపాటు చేసిన ఈ పాదయాత్రను ఈ సమయంలో గుర్తు చేసుకుంటున్నారు.

పాదయాత్ర డిమాండ్లకు తలొగ్గి ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలని పోరాటాలు నిర్వహించిన ఫలితంగా పాలకులు దిగొచ్చి సాధ్యం కాదన్న పట్టాలను ఈ రోజు గిరిజనులకు అందజేస్తున్నారంటే అది ఎర్రజెండా పోరాట ఫలితమే. తమ్మినేనిలాంటి నాయకుడిని మనం గెలిపించుకుంటే ఉపయోగం జరుగుతుందని, ప్రజలు ఆలోచింపజేసే విధంగా ఇంటింటి ప్రచారంలో కార్యకర్తలు ప్రజలకు వివరిస్తున్నారు.

ప్రజా గొంతుకను అసెంబ్లీ పంపండి

బండి రమేష్, సిపిఎం పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ, ప్రజల పక్షాన నిలబడి, పాలక పక్షాలతో కలబడి, చట్టసభల్లో ప్రజా గొంతుకగా ప్రజల పక్షాన పోరాడే నాయకుడు తమ్మినేని వీరభద్రం. ఇలాంటి ప్రజా గొంతుకను పాలేరు నియోజకవర్గంలో గెలిపించుకోవాలి. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ప్రజలు తమ్మినేనిని గెలిపించి అసెంబ్లీ పంపాలి.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి నాయకులు

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న బిఆర్ఎస్‌ను ఓడించాలి

- మధిర సిపిఎం అభ్యర్థి పాలడుగు భాస్కర్‌కు ఒయు జెఏసి సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న కెసిఆర్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని ఉస్మానియా విద్యార్థి జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రంలోని రామ్‌శెట్టి పుల్లయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మధిర నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాలడుగు భాస్కర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో పలు సంఘాలు నిర్వహించిన ఉద్యమాల్లో పాల్గొన్న భాస్కర్‌కు.. తాము సైతం చేదోడు వాదోడుగా ఉండాలనే ఉద్దేశంతో మద్దతు ప్రకటించినట్టు తెలిపారు. అసెంబ్లీలో అణగారిన ప్రజల గొంతుకగా ప్రజావాణిని వినిపించాలనే ఆలోచనతో పాలడుగు గెలుపును కాంక్షిస్తూ మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని గ్రామాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని చెప్పి కెసిఆర్ మోసం చేశారని విమర్శించారు. చైతన్యం కలిగిన మధిర ఓటర్లు సామాజిక ఉద్యమంలో నిరంతరం పాల్గొంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న పాలడుగు భాస్కర్‌కి తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జీవన్, ఉస్మానియా విద్యార్థి జెఎసి విద్యార్థులు యాదగిరి, ఉపేందర్ నాయక్, వంగూరి రాములు, జిల్లా రైతు సంఘం నాయకులు దివ్వెల వీరయ్య, సిఐటియు మండల నాయకులు సగ్గుర్తి సంజీవరావు, వృత్తి సంఘం నాయకులు నాగులవంచ వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్లుగా క్రైస్తవులను పట్టించుకోని కాంగ్రెస్

- ఆ పార్టీ దొంగ డిక్లరేషన్లను నమ్మేది లేదు : మేడే రాజీవ్ సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

50 ఏళ్ల పాలించిన కాంగ్రెస్ పార్టీ క్రైస్తవులను పట్టించుకోకుండా దొంగ డిక్లరేషన్లు, హామీలతో మోసం చేసేందుకు చూస్తోందని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్ విమర్శించారు. హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సెక్యులర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేళ్లలో మైనార్టీలకు కేవలం రూ.రెండు వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. బిఆర్ఎస్ సర్కార్ తొమ్మిదేళ్ల కాలంలో రూ.12 వేల కోట్లు కేటాయించిందని చెప్పారు. బిఆర్ఎస్ సర్కార్ మైనార్టీలు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి ఉన్న స్కాలర్‌షిప్‌ను రూ. పది లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచారని గుర్తుచేశారు. సచివాలయంలో చర్చి నిర్మాణం చేపట్టి క్రైస్తవ ఉద్యోగులు ప్రార్థనలు జరుపుకునేందుకు అవకాశం కల్పించారని హర్షం వ్యక్తం చేశారు. అంతకు ముందు క్రిస్మస్‌కు ఇచ్చే ఒక్క రోజు సెలవును క్రైస్తవ దేశాల తరహాలో రెండ్రోజులకు పెంచారన్నారు. క్రిస్మస్ వేడుకలను అధికారికంగా నిర్వహించడం ప్రారంభించారని తెలిపారు. క్రైస్తవుల ఆత్మగౌరవ భవనం కోసం ఉప్పల్ భగాయత్‌లో రెండెకరాల భూమిని కేటాయించి, నిర్మాణానికి రూ. పది కోట్ల నిధులను ఇచ్చారన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ కేటాయింపుల్లో పాస్టర్లకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. వీటికి తోడు క్రిస్టియన్లకు 100 శాతం సబ్సిడీ మీద రూ. లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నారని వివరించారు. క్రిస్టియన్ మహిళలకు కుట్టుమిషన్‌లో శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారని చెప్పారు.

'హిందూ' ఫొటో జర్నలిస్ట్‌పై దాడి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ది హిందూ ఇంగ్లీష్ డైలీ ఫొటో జర్నలిస్ట్ నగర గోపాల్‌పై హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లో 10 టివి విలేకరి మహేష్ గౌడ్ దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను ప్రథమ చికిత్స అనంతరం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి పోలీసులు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం నేరేడ్‌మెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రెస్‌మీట్ కవరేజీ సందర్భంగా మహేష్ గౌడ్‌కు, గోపాల్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. మీడియా సమావేశం ముగిసిన తర్వాత గోపాల్ తలపై కర్రతో మహేష్ గౌడ్ దాడి చేశారు. దీంతో, గోపాల్ తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న సహచర ఫొటో జర్నలిస్టులు మహేష్ గౌడ్‌ని అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. నేరేడ్‌మెట్ పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. గోపాల్‌పై దాడిని తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండించింది. దాడికి పాల్పడిన మహేష్ గౌడ్‌పై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని ఆ సంఘం అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కెఎన్.హరి డిమాండ్ చేశారు.

అధిక రుణాలు కావాలంటే.. మీటర్లు పెట్టాలన్నాం

- సంస్కరణల్లో భాగంగానే చెప్పాం
- శీతాకాల సమావేశాల్లో ఎస్సి వర్గీకరణ బిల్లు ప్రవేశపెడతాం
- మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'మేం ఖచ్చితంగా చేయమనట్లేదు. రైతుల దగ్గర నుంచి బిల్లులు వసూలు చేయమనట్లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా అప్పులు తీసుకుంటామంటే సంస్కరణలు అమలు చేయాలని చెప్పాం. చేయాలా? వద్దా? అనేది మీఇష్టమనే అప్షన్‌నూ ఇచ్చాం. చేయకపోతే చేయకండి? కంపల్సరీ చేయాలని చెప్పామా? లేదే? ఇది కావాలి.. అదీ కావాలి.. అంటే ఎలా? ఇంకా అప్పులు కావాలంటే సంస్కరణలు అమలు చేయండి. మేం మీటర్ పెట్టం. ఎంత విద్యుత్ వినియోగం అవుతోందన్నది చెప్పం. బిల్లులు కట్టడంలో ఎప్పుడు డిలే చేస్తూ ఉంటాం. రుణాలు మాత్రం కావాలంటే ఎలా? ఇష్టం లేకపోతే పెట్టవద్దు. ఇది సిఎంల సమావేశంలో రికార్డెడ్‌గా ఉన్న విషయం. ఇది కావాలి అదీ కావాలి మోడీ అంటే ఎలా?' అని మోటార్లకు మీటర్ల అంశంపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో వర్గీకరణపై బిల్లు ప్రవేశపెడతామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో మీడియాతో సీతారామన్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కెసిఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక కెసిఆర్ సర్కార్ అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. తెలంగాణలో బిసి నేతను సిఎం చేసి తీరుతామని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ ప్రజల ఆకాంక్ష అనీ, వాటిలో ఏ ఒక్క దాన్ని కూడా కేసీఆర్ ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. హైదరాబాద్ లాంటి నగరాన్ని, నైపుణ్యమున్న యువతను ఉపయోగించుకోవడంలో రాష్ట్ర సర్కారు విఫలమైందని చెప్పారు. రాష్ట్ర సర్కారు చేసిన అప్పులు రాబోయే తరాలకు భారంగా మారబోతోందని హెచ్చరించారు. దళిత సీఎం హామీ ఏమైందని ప్రశ్నించారు. డిప్యూటీ సిఎం రాజయ్యను ఆరు నెలల్లోనే పదవి నుంచి తొలగించారని తెలిపారు. బిసిల అభివృద్ధి కోసం రూ.3,300 కోట్లు వినియోగిస్తామని చెప్పి రూ.77 కోట్లు మాత్రమే ఖర్చు చేశారనీ, ఆ నిధులు ఎక్కడ వాడారో తెలియదని చెప్పారు. రాష్ట్రంలోని 11 వర్సిటీల పరిధిలో రెండు వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర సర్కారు విద్యకు సరైన ప్రాధాన్యత ఇవ్వట్లేదన్నారు. నిరుద్యోగభృతి హామీ ఏమైందని ప్రశ్నించారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆరు వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. జనవరి 22న అయోధ్య రామమందిరాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. కెసిఆర్‌ను జాతీయ నేతగా ఎవ్వరూ ఒప్పుకోవడం లేదని, బిఆర్ఎస్ జాతీయ పార్టీ అనేది బూటకమని ఆమె విమర్శించారు.

నేటి నుంచి పవన్‌కల్యాణ్ ప్రచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుధవారం నుంచి ప్రచారం చేయబోతున్నారు. ఆ పార్టీ అభ్యర్థులతోపాటు కూటమిలో ఉన్న బిజెపి అభ్యర్థుల తరఫున పవన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. వరంగల్ వెస్ట్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి రావు పద్మకు మద్దతుగా బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ నెల 25న తాండూరులో జనసేన అభ్యర్థి శంకర్‌గౌడ్‌కు మద్దుతగా, 26న కూకట్‌పల్లిలో జనసేన అభ్యర్థి ప్రేమ్‌కుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. తెలంగాణలో ప్రధాని మోడీ పాల్గొనే బహిరంగసభల్లోనూ అధికారికంగా పవన్ హాజరుకానున్నారు. ఎన్నికల్లో బిజెపితో ఒప్పందం కుదుర్చుకున్న జనసేన తెలంగాణలో 8 స్థానాల్లో పోటీ చేస్తోంది. 111 స్థానాల్లో పోటీ చేస్తున్న భాజపాకు మద్దతు ఇస్తోంది. ఈ క్రమంలో ఇరుపార్టీల అగ్ర నాయకులు తమ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు.

కాంగ్రెస్‌వైపే టిడిపి శ్రేణులు?

- స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నేతల అడుగులు
- ఎన్నికల తర్వాతే చంద్రబాబు సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంకి పెండ్లి సుబ్బిచావుకొచ్చినట్టు ఉంది తెలంగాణలో టిడిపి పరిస్థితి. రాష్ట్రంలో జరుగుతున్న తాజా అసెంబ్లీ ఎన్నికలకు దూరంగా ఉండటంతో ఆ పార్టీ మద్దతు ఎవరికనే విషయమై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఆ పార్టీ అధినేత చంద్రబాబుపై ఎపి సర్కారు కేసుల నేపథ్యంలో తెలంగాణ ఎన్నికల్లో టిడిపి పోటీకి దూరంగా ఉంది. నిర్ణయాలు చేయడానికి చంద్రబాబు అందుబాటులో లేకపోవడంతో ఈపరిస్థితి తలెత్తిన సంగతి తెలిసిందే. చివరకు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న ఆ పార్టీ అధినేతతో సంప్రదించిన తర్వాత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని దిశానిర్దేశం చేయడంతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆశ్చర్యానికి, ఆందోళనకు లోనయ్యారు. దీంతో మూడు వారాల క్రితం వరకు అధ్యక్షుడిగా కొనసాగిన కాసాని జ్ఞానేశ్వర్ సైతం రాజీనామా చేయడంతో అంతర్గత వ్యవహారాలు గందరగోళంగా మారాయి. ఇప్పుడు ఆ పార్టీకి అధ్యక్షుడు లేకుండానే కొద్ది రోజులుగా కొనసాగుతున్నది. తెలంగాణ ఎన్నికల తర్వాత కొత్త నేతను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. ఈనెల 28వరకు ఎపి ఎసిబి కోర్టు

విధించిన ఆంక్షల నేపథ్యంలో రాజకీయ కార్యకలాపాలకు చంద్రబాబు దూరంగా ఉంటున్నారు. అలాగే ఈనెల 30న తెలంగాణలో పోలింగ్ జరగనుంది. ఈ పరిస్థితుల్లో రాజకీయ నిర్ణయాలు చేసే పరిస్థితి లేదని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. కాగా ఎన్నికల తర్వాతే చంద్రబాబు తెలంగాణ నేతలతో భేటీ అవుతారని ఆ పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు. రాజీనామా చేసి బిఆర్ఎస్‌లోకి వెళ్లిన పాత అధ్యక్షులు టిడిపికి చెందిన అన్నీ కమిటీలను రద్దుచేసి, కేవలం రాష్ట్ర కమిటీనే నియమించారు. ఇది కూడా కొంత ఇబ్బందులపాల్జేసినట్టు నేతలు చెబుతు న్నారు. ఇకపోతే సమిష్టి నిర్ణయాలు కాకుండా ఏకపక్షంగా వ్యవహరించడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయని అంటున్నవారు లేక పోలేదు. ఇదిలావుండగా తాజా అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి మద్దతు ఎవరికనే ప్రశ్న సహజంగానే ముందుకొచ్చింది. అయితే రాష్ట్ర నాయకత్వం వైఖరి మాత్రం అన్నీ పార్టీలకు సమానదూరం పాటించాలనే వైఖరితో ఉంది. అయితే అదే విషయాన్ని అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం. దీంతో గ్రామ, మండల, లోక్‌సభ నియోజకవర్గాల వారీగా ఉన్న ఆపార్టీ కమిటీలే సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు సమాచారం. రాష్ట్రంలో ఆపార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే అత్యధిక జిల్లాల్లో కాంగ్రెస్‌వైపు మొగ్గుచూపుతున్నట్టుగా కనిపిస్తున్నాయి. ఆ పార్టీ క్యాడర్ ఇటు బిజెపికి, అటు బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా అడుగులేసున్నాయి. ఖమ్మంలో కాంగ్రెస్ నుంచి పోటీచేస్తున్న తుమ్మల నాగేశ్వర్‌రావుకు మద్దతు ప్రకటించారు. అలాగే నాగర్ కర్నూల్‌లో కాంగ్రెస్ అభ్యర్థికే జైకొడుతున్నారు. హైదరాబాదలోని ఖైరతాబాద్ అసెంబ్లీ సీటులో కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న పీజేఆర్ కూతురు విజయారెడ్డికి మద్దతు ప్రకటించారు. అయితే కొడంగల్‌లో ఆ పార్టీ వ్యవహారం భిన్నంగా ఉంది. టిపిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డికి కాకుండా బిఆర్ఎస్ అభ్యర్థి మాజీ టిడిపి నేత పట్నం నరేందర్‌రెడ్డికి సంఘీభావం తెలియజేశారు. వైరాలో టిడిపి మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బిఆర్ఎస్ అభ్యర్థి సండ్ర వెంకట వీరయ్యకు మద్దతు ఇస్తున్నారు. ఇలా ఒక్కోచోట ఒక్కోలా కిందిస్థాయి కమిటీలు నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అయితే ఎక్కువచోట్ల మాత్రం కాంగ్రెస్ అభ్యర్థులకే టిడిపి పరోక్షంగా మద్దతు ఇస్తున్నది. కొన్నిచోట్ల నేరుగా ఎన్నికల ప్రచారానికి సైతం జెండాలు పట్టుకుని వెళుతున్నారు. స్థానిక పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకుంటున్నారు. రాష్ట్ర పార్టీ ఎన్‌టిఆర్ ట్రస్ట్‌భవన్ నుంచిగానీ, ఎపిలోని మంగళగిరిలో ఉన్న జాతీయ కార్యాలయం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ప్రస్తుతం చంద్రబాబు తెలంగాణ పార్టీ గురించి ఆలోచించే అవకాశం లేదని సమాచారం. ఎన్నికల తర్వాత తెలంగాణ నేతలతో భేటీ జరగనుంది. అప్పుడే కొత్త అధ్యక్షుడి ఎంపిక తదితర అంశాలు ముందుకు రానున్నాయని సమాచారం. పూర్తిస్థాయి సమీక్ష జరిగిన తర్వాతే కొత్తనేతను ఎంపిక చేస్తారనీ, పూర్తిస్థాయి ప్రక్షాళన సైతం జరుగుతుందని ఆ పార్టీ జాతీయ నేత నన్నూరి నర్సిరెడ్డి తెలిపారు.

జానపద కళల ఖజానా.. తెలంగాణ

ప్రజాశక్తి - కల్చరల్

తెలంగాణా రాష్ట్రం జానపద కళలకు ఖజానా అని, దేశంలో ఏ రాష్ట్రం లోనూ లేని వైవిధ్య ప్రక్రియలు ఇక్కడే ఉన్నాయని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖా సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్పందన ఆర్ట్స్ నిర్వహణలో తెలంగాణ జాన పద మణిహారం పేరిట కళా జాతర జరిగింది. పానుగంటి వెంకటేష్, డాక్టర్ మీనాక్షి పద్మనాభన్, గణేష్, దేవకి తార అలోక్ రంజన్ తదితర బృందాలు కళా ప్రదర్శనలో పాలుపంచుకున్నారు అనంతరం జరిగిన సభా కార్యక్రమమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గొని జానపద కళా కారుడు శ్రీకాంత్ గౌడ్‌ను సత్కరించి మాట్లాడారు. జాతి ఉనికి ఆ ప్రాంత భాషా, ఆచార వ్యవహారాలతో పాటు కళలు పై ఆధార పడి వుంటుందన్నారు

తరతరాలుగా వస్తున్న జానపద కళా సంప్రదాయాన్ని కాపాడు కోవాలని సూచించారు. అట్టి కృషి చేస్తున్న వారిలో శ్రీకాంత్ ఒకరని అభినందించారు. భారత్ వరల్డ్ రికార్డ్ అధ్యక్షుడు కెవి రమణారావు అధ్యక్షత వహించగా నటుడు రాంకీ, బాలకృష్ణ గురుస్వామిదైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు

గిరిజన హామీలను అమలు చేయని బిఆర్ఎస్‌ను ఓడించండి

కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గిరిజనులను మోసగిస్తున్న సిఎం కెసిఆర్‌ను ఎన్నికల్లో ఓడించాలని కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ పిలుపునిచ్చారు. '12 శాతం రిజర్వేషన్లు ఇవ్వలేదు. తండాలను గ్రామ పంచాయతీలను చేస్తానని మాట తప్పాడు. గిరిజన తెగలకు కార్పొరేషన్ నుంచి పైసా రాలేదు. ఆర్థికంగా బలోపేతం ఏమైంది' అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. .కాంగ్రెస్ పార్టీ 85 సీట్లు సాధించి అధికారంలోకి రాబోతుందని టిపిసిసి అధికార ప్రతినిధి బెల్లయ్యానాయక్ తెలిపారు. 'కామారెడ్డిలో కేసీఆర్, సిరిసిల్లలో కేటీఆర్ ఓటమి ఖాయం. రెండు సార్లు అబద్ధాలతో కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. 9.98 లక్షల గిరిజనుల జనాభా..12 శాతం రిజర్వేషన్ అని కెసిఆర్ మోసం చేశారు. గోండు, కోయలను, గిరిజనులను, లంబాడీలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేసింది. వన్ సైడ్‌గా కెసిఆర్‌ను ఓడించబోతున్నారు' అని చెప్పారు.

బిజెపి నేత మృత్యుంజయం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు రాష్ట్ర ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లబిఆర్ఎస్‌ప్రభుత్వాన్ని కూకటి వెళ్ళతో పెకలించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల తర్వాత ఒకరోజు కూడా కెసిఆర్ ప్రభుత్వం ఉండడానికి వీలులేదన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా 15 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించాలంటూ ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ప్రత్యేకంగా మాజీ ఎంపి వి హనుమంతరావును ఆదేశించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆ లేఖను వీ హెచ్ మీడియాకు విడుదల చేశారు. 25 నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ మక్తల్ నియోజకవర్గం నుంచి ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు

డిఎంకె అధికారిక ప్రకటన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని తెలంగాణలోని పార్టీ శ్రేణులకు డిఎంకె పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం డిఎంకే అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని ఆదేశించింది.

హైదరాబాద్‌కు చేరుకున్న ఖర్గే

ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మంగళవారం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయన రాత్రికి హైదరాబాద్‌లో బస చేయనున్నారు. బుధవారం ఉదయం 12 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి అలంపూర్ వెళ్లనున్నారు. అక్కడ బహిరంగసభలో ప్రసంగించనున్నారు. అనంతరం నల్లగొండ ప్రచార సభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత తిరిగి ఢిల్లీ వెళ్లనున్నారు.

కాంగ్రెస్ ఎన్నికల సమన్వయ కమిటీని నియమించింది. కాంగ్రెస్, సిపిఐ, టిజెఎస్ పార్టీలకు చెందిన నాయకులను నియమించింది. మల్లు రవి, కోదండరెడ్డి (కాంగ్రెస్), చాడవెంకట్‌రెడ్డి, బాలమల్లేష్, ఈటీ నరసింహ (సిపిఐ), కోదండరాం, పిఎల్ విశ్వేశ్వరరావు (టిజెఎస్)లతో కమిటీ ఏర్పాటు చేసింది.

కెసిఆర్‌కు మతి భ్రమించింది : షర్మిల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి కెసిఆర్, కెటిఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు వైఎస్ షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉండి కూడా 65వేల ఉద్యోగాలు ఇవ్వలేనోడు తిరిగి అధికారం కావాలని అడగటం విడ్డూరంగా ఉందని తెలిపారు.డబుల్ బెడ్‌రూంల కోసం 12 లక్షల దరఖాస్తులు వస్తే లక్ష ఇండ్లు కట్ట చేతకాలేదని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నేతలకు అధికార మదంతో నిరుద్యోగులు సన్నాసుల్లా కనిపిస్తున్నారా? అని ఆమె ప్రశ్నించారు.

మాటల్లోనే మైనార్టీల అభివృద్ధి

- బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష
- డబుల్ బెడ్‌రూమ్‌లకోసం ఎదురుచూపు
- రుణాల కోసం కార్పొరేషన్ చుట్టూ చక్కర్లు
- పోరాటాలతోనే సర్కారులో కదలిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ముస్లిం మైనార్టీల్లో సంచార, అర్ధ సంచార జాతులైన తురక కాశ, పకీర్, గారెడివాలా, అత్తర్ సాయిబులు, ఎలుగుబంటివాలా, బోరెవాలా, గంటెటవాలా, బందర్ కిలానే వాలా, సాంపుకిలానెవాలా, బుగ్గవాలా తదితర తరగతులవారు సుమారు పది లక్షల మంది రాష్ట్రంలో ఉన్నారు. వీరంతా చాలా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. విద్యా, ఉపాధిలో అధమ స్థానంలో ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రామాలు తిరుగుతూ భిక్షాటన మీద ఆధారపడి బతుకుతున్నారు. చిన్నచిన్న వృత్తులు చేసుకుంటుంయా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారు. ప్రభుత్వ పథకాలేవి వారి దరికి చేరడం లేదు. ఆవాజ్ ఈ సమస్యల పరిష్కారం కోసం పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహించింది. పోరాటాల ఫలితంగా కొన్ని విజయాలను సాధించింది.

పోరాటాలతోనే ప్రభుత్వంలో కదలిక

మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ఆ సమస్యలపై నిర్విరామంగా ఆవాజ్ పనిచేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీలు అధికంగా ఉన్న పట్టణ ప్రాంతాలను గుర్తించి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వేలు నిర్వహించింది. ఆ తర్వాత సమస్యల పరిష్కారం కోసం జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆందోళనలు చేపట్టింది. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్, జస్టిస్ రాజేందర్ సచార్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా మైనార్టీలకు బడ్జెట్ సబ్ ప్లాన్, రిజర్వేషన్ అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించింది. అన్ని మైనార్టీ సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలు నిర్వహించడం మూలంగానే ఈ మాత్రమైనా బడ్జెట్లో కేటాయింపులు పెరిగాయి. రిజర్వేషన్ల అంశంలో కదలిక వచ్చింది. మైనార్టీ కమిషన్ తదనంతరం బిసి కమిషన్ ఏర్పాటుకు దారితీసింది. ఉద్యోగులు, మధ్యతరగతి, విద్యార్థులు ,యువకుల్లో ఆవాజ్ పోరాటాల పట్ల సానుకూలత పెరిగింది.

సొంతింటి కల కలగానే..

రాష్ట్రంలో 45 శాతం ముస్లిం మైనార్టీ కుటుంబాలకు సొంతిల్లు లేదు. వారు ప్రభుత్వం ఇస్తానన్న డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కోసం కళ్లు కాయలు కాసేలాగా ఎదురు చూస్తున్నారు. అర్హత కలిగిన అందరికీ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని ఆవాజ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పది జిల్లా కలెక్టరేట్ల ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించింది. ఈ కార్యక్రమాల్లో మహిళలు అత్యధికంగా పాల్గొన్నారు. అర్హత కలిగిన అందరికీ ఇళ్లు కేటాయిస్తామంటూ ప్రభుత్వం మభ్యపెడుతోంది. రాబోయే కాలంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాల్సి ఉంది.

ఎండమావిగా కార్పొరేషన్ లోన్లు..

చిరు వ్యాపారులు, నిరుద్యోగులు స్వయం ఉపాధి కోసం బ్యాంకులతో నిమిత్తం లేకుండా మైనార్టీ కార్పొరేషన్ నుంచి ప్రత్యక్ష రుణాలకోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ప్రభుత్వం కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి, వారికి రుణాలు అందించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దీనిపై పలు సార్లు ఆందోళనలు జరిగాయి. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయం ముట్టడి జరిగింది. దీంతో ప్రభుత్వం దిగి వచ్చింది. కొందరికి మాత్రమే లోన్లు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారందరికీ లోన్లు ఇవ్వాలని ఆందోళన నిర్వహించాల్సి ఉంది.